సిగరెట్లు త్రాగం, పేకాటాడటం మొదలైనవి బహు చురుకుగా నేర్చుకొన్నాడు. బడికి ఎప్పుడో బుద్ధి పుట్టినప్పుడు వెళ్ళడం, లేకపోతే పాడుపడ్డ శివాలయంలో, మండపంలో కూర్చుని ఈలవేసుకుంటూ పేకాట ఆడటం. వీడి వరుసలు సుబ్బమ్మగారికి ఏమీ నచ్చలేదు. కాని వాడిని మందలించే ధైర్యం ఆమెకు లేదు. తండ్రిలేనిబిడ్డడు. మనస్సు ఏమి చిన్నబుచ్చుకుంటాడోనని బాధపడేది. ఇరవయ్యోపడిలో పడ్డా, అతను ఆమెకు పసివాడిలాగానే కన్పించాడు. కొంచెం వయస్సు వస్తే వాడే దారికి వస్తాడు అనుకునేది ఆమె. కాని ఆ ఆశ నిరాశ అయింది. ఎప్పుడైనా మరీ చిరాకెత్తి కొంచెం మందలిస్తే రఘూ ఒక వెర్రినవ్వు నవ్వి వెళ్లిపోయేవాడు. వాడికి కావలసినంత డబ్బు అమ్మ ఇయ్యవలసిందే. లేదా తనే అమ్మ పెట్టెలోంచి తీసుకునేవాడు. ఆమె అడ్డు చెప్పలేకపోయేది.

ఆరోజు ఏకళనున్నాడో రఘు బడికి వెళ్లాడు. ఇంగ్లీషుకి క్రొత్త మాస్టారు వచ్చారు. ఆయన ఆ స్కూలులోనే పనిచేస్తున్నా ఆ క్లాసుకి రావడం అదే క్రొత్త. ఆయనంటేనే బడిపిల్లలకు హడల్. ఆయన క్లాసులోకి రాగానే పిల్లలంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కూర్చున్నారు. ఆయన పాఠం చెప్పి అందులోని ప్రశ్నలు వరుసగా పిల్లలను అడుగుతూ వస్తున్నారు. రఘూని రెండు మూడు ప్రశ్నలు అడిగినా అతను సమాధానం చెప్పలేక పోయాడు.

"మనిషివి చూడబోతే ఎద్దల్లే ఉన్నావు. చదువు చూడబోతే మొద్దల్లే ఉంది .... బెంచెక్కు' ' అన్నారు మాస్టారు. క్లాసంతా గొల్లున నవ్వారు. "సైలెన్స్" అని మాస్టారు బల్లమీద గట్టిగా చరిచారు. రఘూకి తల తీసేసినంత అవమానం అయింది. ముఖం ఎర్రబడిపోయింది. అలాగే నిల్చుండిపోయాడు. "ఎక్కవేం" అన్న మేస్టారు కేకతో ఉలిక్కిపడి అప్రయత్నంగా బల్ల ఎక్కి నిలబడ్డాడు. కళ్ళనీళ్ళు మినహా ఏడుపు వచ్చేస్తోంది. ప్రయత్నం మీద ఆపుకుంటున్నాడు. అతని అవస్థ కొంచెంసేపు గమనించి మాస్టారు, ఓ పావుగంట అయ్యాక మళ్ళీ కూర్చోమన్నారు.

రఘు కూర్చున్నాడే కాని అతని హృదయం ఉడికిపోతోంది. అవమాన భారంతో కృంగిపోతున్నాడు. మాస్టరుపైన ఏవిధంగానైనా కసితీర్చుకోవాలనుకుంటున్నాడు. ఆ కసి పట్టలేక నోటు బుక్కు తీసుకుని అందులో మొరుగుతున్న కుక్కబొమ్మ వేసి దానిక్రింద మేస్టరుగారి పేరు వ్రాశాడు. అంతటితో వూరుకోక ఆ బొమ్మని ప్రక్క కుర్రాడికి చూపించాడు. అది చూసి వాడు ఇకిలించాడు. అక్కడ ఏదో వింత ఉందని మరి రెండు వెనుక తలకాయలు ముందుకు సాగాయి. ఇక్కడ ఏదో కుంభకోణం జరుగుతోందని పసికట్టారు మేస్టరుగారు. అకస్మాత్‌గా వచ్చి నోటుబుక్కు లాక్కుని చూశారు. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకి రఘు తెల్లబోయాడు. మిగతా కుర్రవాళ్ళు ఎవరి సీట్లలో వాళ్లు బుద్ధి మంతులులా కూర్చొన్నారు. క్లాసంతా అటువైపే చూస్తోంది. మాస్టరుగారు కోపంపట్టలేక పోయారు. ఫెడీ ఫెడీ రఘూని రెండు లెంపకాయలు వాయించి బయటకు గెంటివేశారు. రఘూ పుస్తకాలు తీసుకుని ఉడికిపోతున్న రక్తంతో మండపంలో చేరాడు. అక్కడ మిత్రబృందం ఆటకు రమ్మనమని పిలిచింది కాని వెళ్లలేదు. జరిగిన అవమానాన్ని తట్టుకుని ఎలా ప్రతీకారం తీర్చుకోవాలా అని ఆలోచిస్తూ మెట్టుమీద కూర్చుండిపోయాడు. అంతే .... ఆరోజునుంచి మళ్ళీ రఘూ బడికి వెళ్లలేదు. సుబ్బమ్మగారు గోల పెట్టింది. బ్రతిమాలింది. ఫలితం లేకపోయింది. చివరికి బాధపట్టలేక గట్టిగా కేకలు వేసింది. దాంతో రఘు రెచ్చిపోయి రెండు రోజులు ఇంటికి రావడం మానేశాడు. సుబ్బమ్మ గారు ఒకరోజు పౌరుషం కొద్దీ వూరుకున్నా, రెండవ రోజు మమత చంపుకోలేక స్వయంగా గుళ్ళోకి వెళ్లి కొడుకుని బ్రతిమాలి ఇంటికి తీసుకువచ్చింది. బళ్లో జరిగిన సంఘటనకు, కొడుకు ప్రవర్తనకు ఆమె హృదయం ఎంతగానో క్షోభించింది. కాని చేసేది ఏముంది? మొక్కగా వంగనిది

ప్రూనై వంగుతుందా?

తల్లి అలుసు చూసుకుని రఘూ మరీ పేట్రేగి పోయాడు. బడికి వెళ్లే అవసరం కూడా తీరిపోవడంతో అతను మరీ విచ్చలవిడిగా తిరగడం ప్రారంభించాడు. దుర్వ్యసనాలన్నిటికీ పాల్పడ్డాడు. డబ్బును మంచినీళ్లలాగా ఖర్చుపెడుతున్నాడు. రోడ్డుమీద పోయే ఆడవాళ్లను చూసి ఈలలు వేయడం, వెకిలి వేషాలు వేయడం, రౌడీ పోజులు ఈయడం మొదలైన తప్పుడు పనులన్నీ చేసేవాడు. రోజురోజుకీ రఘూని గూర్చి సుబ్బమ్మగారికి ఫిర్యాదులు ఎక్కువగా రావడం మొదలు పెట్టాయి. ఆవిద నోటి మంచితనం వల్ల అందరికీ ఏదోవిధంగా సర్దిచెప్పి పంపిస్తూ ఉండేది. ఆవిడమీది గౌరవం కొద్దీ అందరూ కూడా ఎక్కువగా గోలచేసేవారు కాదు. కాని రఘూ అత్యాచారాలు రోజురోజుకీ మితిమీరిపోతుంటే ఎవరు మాత్రం వూరుకుంటారు ..... ఎన్నాళ్లని వూరుకుంటారు? అయినింటి ఆడబడుచులను నానా అల్లరీ పెడుతుంటే ఎవరు మాత్రం సహిస్తారు? ఇవన్నీ విని సుబ్బమ్మగారి బుర్ర బొప్పికట్టింది. అందరూ "ఎటువంటి ఇల్లాలికి ఎటువంటి కొడుకు పుట్టాడు" అని బాధపడేవారు. ఇవన్నీ చూసి సుబ్బమ్మగారు తనకి చావైనా రాదేమి భగవంతుడా అని బాధపడేది.

ఆరోజు సాయంత్రం మసక చీకటి పడుతోంది. సుబ్బమ్మగారు వంటపని పూర్తి చేసుకుని అప్పుడే సావిట్లోకి వచ్చింది. వీధిలో ఏమిటో గోలగా ఉంటే ఏమిటా అని వీధిలోకి వచ్చింది. పదిమంది పోగయి ఆమె ఇంటివైపే వస్తున్నారు. వారిమధ్యలో రఘూని నలుగురు పట్టుకుని తన్నుకుంటూ తీసుకువస్తున్నారు. ఇంకా ముందు ముగ్గురు నలుగురు ఆడవాళ్ళు ఉన్నారు. ఈగుంపు వెనకాల పది పదిహేనుమంది పిల్లగాంగు - అంతా కోలాహలంగా ఉంది. ఆ గుంపంతా సుబ్బమ్మగారి ఇంటి ముందు నిలిచింది. ఆ దృశ్యం చూసేసరికి ఆమె గుండె గతుక్కుమంది.

ఆ జనంలోంచి ఒకడు "ఏమమ్మా. మమ్మల్ని ఈవాడలో ఉండమంటావా, లేచిపొమ్మంటావా?" అని అరిచాడు.

మరి ఒకగొంతు "ఏమమ్మోయి, నీ కొడుకుని దారిలోకి తెచ్చుకుంటావా - వాడి మక్కెలు విరగకొట్టి మూల పారేయమంటావా?" అని అడిగింది.

ఇంకొకడు "ఆవిడేం చేస్తుందిరా. ఆ తల్లి పెంపకమే వీణ్ణిలా చేసింది" అన్నాడు.

ఇవన్నీ చూసి సుబ్బమ్మగారికి ఒళ్ళు కంపించింది. అందులో జనం మాటలు వింటుంటే మతిపోసాగింది ఆమెకు.

ఆమె కంపితస్వరంతో "ఆగండి నాయనా .... ఆగండి ... అసలు ఏం జరిగింది? .... వాడిని విడిచిపెట్టండి" అంది.

అందులో ఒకడు "ఇంకా ఏం జరగాలమ్మా. ప్రక్కవీధిలో రామయ్యగా రమ్మాయి పంపుదగ్గర నీళ్లు పట్టుకోడానికి వచ్చింది. సందు చీకటి చీకటిగా ఉంది. జనం సరిగ్గా లేరు. ఈడు అటే ఒస్తుంటాడు కామోసు. ఎవరూ లేరని ఎనకాల నుంచి పైట లాగాడు. ఆ అమ్మాయి భయపడి అరవబోతే ఎకసక్కా లాడాడుట. ఆ అమ్మాయి కేకలు వేసింది. ఆసందు మొగలో కిల్లీకొట్టు దగ్గర వాళ్ళన్నయ్య ఉన్నాడు. ఆ కేకలు వినాయనా, మరి నలుగురూ పరిగెత్తుకు వచ్చారు. ఈణ్ణి పట్టుకు నాలుగు తన్నారు. ఈలోపల మేమంతా వచ్చాం. ఈ ఇదంగా అయితే ఈవాడకట్టున కాపురం చేయగలమా?" అన్నాడు.

ఇది వినేసరికి సుబ్బమ్మగారికి పట్టరాని కోసం వచ్చింది. ఆవేశం పట్టలేక చకచకా వెళ్లి రఘు జుట్టు చేతితో గట్టిగా పుచ్చుకుని తల గుంజుతూ "ఛీ, వెధవా, నా కడుపున చెడబుట్టావు.

